# మడకశిరలో అక్రమ లేఔట్లు

- ఇప్పటికే 16 అక్రమ లేఔట్లను గుర్తించిన అధికారులు
- జేసీబీలతో తొలగింపు పనులు
- అక్రమ లేఔట్లలో ఇంటి స్థలాలు కొనుగోలు చేయొద్దంటున్న అధికారులు



మడకశిర మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా వేసిన ఓ లేఔట్

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో కొందరు అక్రమార్కులు అక్రమ లేఔట్లు వేసి ప్రజలను మభ్యపెడుతున్నారు. ఈ అక్రమ లేఔట్లలో ఇంటి స్థలాలు కొనుగోలు చేసి ఎంతో మంది అమాయక ప్రజలు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ప్రజలు నష్ట పోకుండా ఉండేందుకు వీలుగా అక్రమ లేఔట్లపై చర్యలు ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తొలుత నోటీసులు ఇచ్చి అక్రమంగా వేసిన లేఔట్లను తొలగించాలని కోరారు. అయితే ఈనోటీసులకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్పందించ లేదు. దీంతో మున్సిపల్ అధికారులు నేరుగా రంగంలోకి దిగారు.

**అక్రమ లేఔట్లు ఇవే...**

మడకశిర పరిధిలోని మారుతీనగర్, మధుగిరి రోడ్డు, వైబీ హళ్లి రోడ్డు, సెరికల్చర్ ఆఫీసు వెనుక, ఆదిరెడ్డిపాళ్యం, పెనుకొండ రోడ్డు, మళ్లినాయకనహళ్లి రోడ్డు, బేల్దార్ కాలనీల్లో అక్రమ లేఔట్లు వెలిశాయి. ఎలాంటి అనుమతులు పొందకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా లేఔట్లను వేశారు. 473, 476, 232, 480, 474, 443, 484, 489, 272, 121-3ఏ, 119-5, 119-4, 573, 557, 558, 546-1, 454 సర్వేనంబర్లలో లేఔట్లు వేయడంతో వాటిని తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తంగా అక్రమంగా వేసిన 16 లేఔట్లను గుర్తించామంటున్నారు. ఇంకా మున్సిపాలిటీపరిధిలో ఉన్న అక్రమ లేఔట్లను గుర్తించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

**స్థలాలు కొనుగోలు చేయొద్దు**

మడకశిర మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా వేసిన లేఔట్లలో ఇంటిస్థలాలు కొనుగోలు చేయొద్దని ప్రజలను మున్సిపల్ అధికారులు కోరుతున్నారు. అక్రమ లేఔట్లలోని ఇంటి స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి మున్సిపల్ అధికారులు అనుమతి మంజూరు చేసే అవకాశం ఉండదు. అలాగే విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వరు. ఇళ్ల నిర్మాణానికి బ్యాంకులు రుణాలు కూడా మంజూరు చేయవు. మున్సిపాలిటీ నుంచి తాగునీటి సరఫరా కూడా ఉండదు.ఇ లాంటి ఇబ్బందులను గుర్తించి ప్రజలు అక్రమ లేఔట్లలో ఇంటిస్థలాలు కొనుగోలు చేయొద్దని అధికారులు కోరుతున్నారు.

**అర్హత ఉంటేనే..**

మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ యాక్ట్ ప్రకారం ఎల్ఆర్ఎస్‌కి అర్హత కలిగిన లేఔట్లలో మాత్రమే ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇస్తున్నారు. 2019 ఆగస్టు 31 వరకు ఎల్ఆర్ఎస్ కటాఫ్ తేదీ ఉంది. ఆ లోపు వేసిన లేఔట్లలో మాత్రమే ఇళ్ల నిర్మాణానికి అనుమతి లభిస్తోంది. ఆ తర్వాత వేసిన అక్రమ లేఔట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వమని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. ఇలాంటి పరిస్థితిలో అక్రమ లేఔట్లలో ఇంటి స్థలాలు కొనుగోలు చేసిన వారి పరిస్థితి కడు దయనీయంగా మారింది. ఏది ఏమైనా అక్రమ లేఔట్ల తొలగింపు మడకశిరలో చర్చనీయాంశంగా మారింది.

### అక్రమ లేఔట్లను ఉపేక్షించం



అక్రమ లేఔట్లను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించం. ఎంతటి వారైనా అక్రమ లేఔట్లను తొలగిస్తాం. ఇప్పటికే 16 లే ఔట్లను తొలగించాం. ప్రజలు కూడా అనధికార లేఔట్లలో ఇంటి స్థలాలు కొనుగోలు చేసి నష్టపోవద్దు. అన్ని అనుమతులు పొందిన తర్వాతే లేఔట్లు వేసుకోవాలి. అనధికార లేఔట్లలోని ఇంటి స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతి లేదు.

– రంగస్వామి, మున్సిపల్ కమిషనర్, మడకశిర

## జీతం ఇక్కడ.. విధులు అక్కడ !

- ఇబ్బందుల్లో రోగులు, వైద్య సిబ్బంది



రొద్దంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రొద్దం: మండల కేంద్రంలోని 24 గంటల ప్రభుత్వ ఆస్పత్రిలో అటెండర్ లేకపోవడంతో సమస్యగా మారిందని ఆస్పత్రిలో వచ్చే రోగులు, సిబ్బంది వాపోతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న అటెండర్ సుధాకర్‌ను పెనుకొండ ఆస్పత్రికి పంపించడంతో తీవ్ర ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. జీతం ఇక్కడ విధులు అక్కడ ఎందుకని? వారు ప్రశ్నిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వాచ్‌మెన్ నారాయణప్ప ఇటీవల ఉద్యోగ విరమణ పొందాడని తెలిపారు. వాచ్‌మెన్‌తో పాటు అటెండర్ కూడా లేకపోవడంతో రోగులకు తాగునీరు తీసుకొచ్చేవారు కూడా లేరని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొద్దం ఆస్పత్రికి సంబంధించి అటెండర్ సుధాకర్‌ను ఇక్కడికి పంపడానికి చర్యలు తీసుకోవాలన్నారు. 24 గంటలు ఆస్పత్రి కావడంతో అటెండర్ లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

## రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు

- ఇబ్బందుల్లో వాహనదారులు



బసవనపల్లి - ఉప్పార్లపల్లి మధ్య రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

మడకశిర: నియోజకవర్గంలోని పలు రోడ్లకు ఇరువైపులా కంప చెట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో రాకపోకలకు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అమరాపురం మండలంలోని బసవనపల్లి, ఉప్పార్లపల్లి, కడదతపాళ్యం, కరిదాసనహట్టి, తాళికెరను కలిపే ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెద్ద ఎత్తున పెరగడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే కంపచెట్లు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. నియోజకవర్గంలోని మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాల్లో ఇలాంటి రోడ్లు అనేకం ఉన్నాయి. ఇలాంటి రోడ్లను ఆర్అండ్‌బీ, పీఆర్ అధికారులు గుర్తించి కంపచెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### ఆధార్ సెంటర్ పరిశీలన



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ ఆరాధ్య

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఆధార్ సెంటర్‌ను మంగళవారం మండల పరిషత్ ఏఓ ఆరాధ్య పరిశీలించారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులకు వచ్చిన వారు ఇబ్బంది పడకుండా ఆధార్ సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు.

### మడకశిరలో ఆధార్ సేవలు ప్రారంభం

మడకశిర: పట్టణంలో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు సేవలు ప్రారంభమయ్యాయి. కొత్త ఎస్సీ కాలనీ వార్డు సచివాలయంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈనెల 27 వరకు ఈసేవలు కొనసాగుతాయని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి తెలిపారు.


### 'హంద్రీనీవా'లో పూడికతీత పనులు చేపట్టాలి




డీఈ యోగానందకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హిందూపురం: హంద్రీనీవా కాలువలో పూడిక తీయడంతో పాటు మరమ్మతులు పూర్తిచేసి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని 265 చెరువులు నింపాలను హిందూపురం డివిజన్ జలసాధన సమితి నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం నీటిపారుదలశాఖ డీఈ యోగానందకు వినతిపత్రం అందించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు చేపడతామని డీఈ హామీ ఇచ్చారు. జలసాధన సమితి అధ్యక్షుడు ధనాపురం వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం శ్రీనివాసులు, తిప్పేస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో జలధి ఉత్సవం



మోదాలో పీర్లస్వాముల అగ్నిగుండ ప్రవేశం



నాయనిపల్లిలో జలధికి తరలుతున్న పీర్లు

పరిగి: మండలంలోని మోదా గ్రామంలో మొహర్రం సందర్భంగా ఏర్పాటు చేసిన పీర్లను మంగళవారం జలధికి తరలించారు. ఉదయం పీర్ల చావిడిలో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. సాయంత్రం పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. పీర్లస్వాములతో కలిసి పలువురు భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి జలధికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అలావ్ తొక్కుతూ సందడి చేశారు.

లేపాక్షి: మండలంలోని కల్లూరు, నాయనిపల్లి, శిరివరం తదితర గ్రామాల్లో మంగళవారం జలధి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అగ్నిగుండం చుట్టూ ఊరేగించారు. ఈ సందర్భంగా చెక్కర, బెల్లం, శనగపప్పులు చదివింపులను చేయించారు. గ్రామాల్లో ఊరేగింపు అనంతరం పీర్ల స్వాములను జలధికి తరలించారు.

## వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



అలంకరణలో కొల్హాపురమ్మ

మడకశిరరూరల్: మండల పరిధిలోని సీ కొడిగేపల్లి గ్రామంలో వెలసిన కొల్హాపురమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామికి, మధ్యాహ్నం కొల్హాపురమ్మకు భక్తిశ్రద్ధలతో పెద్ద ఎత్తున జ్యోతులు సమర్పించారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత కొల్హాపురమ్మ రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

### ఆధార్ లింక్ సరికాదు

పావగడ: పంట పొలాలకు నీరందించే విద్యుత్ మోటార్లకు ఆధార్ లింక్ చేయండని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలివ్వడం సరికాదని స్థానిక హసిరు సేన రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. స్థానిక బెస్కాం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్నారు. వెంటనే ఆధార్ లింక్ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక పాల్గొనాలని కోరారు.

### మొక్కలు నాటి సంరక్షించుకుందాం

హిందూపురం టౌన్: రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్ఆర్‌జీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు విద్య, కార్యదర్శి అశ్వతలక్ష్మీ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీవాణి, సభ్యులు తదితరులు పాల్గొని మొక్కలను నాటారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు.

### ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

అమరాపురం: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఆర్ఎంపీ క్లినిక్‌లను హేమావతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భార్గవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు తగిన ధ్రువపత్రాన్ని కలిగి ఉండాలన్నారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, కొందరు హైడోస్ మందులను ఇచ్చి ప్రజలకు ఇబ్బందులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలా చేసేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### సీఎం ఇంటి ముట్టడికి తరలిరండి

పావగడ: కార్మిక సంఘాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 5న చేపట్టనున్న సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమానికి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి గిరీశ్ పిలుపునిచ్చారు. కార్మికుల పిల్లలకు విద్యా ధనం అందించాలని, కార్మికులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు.

### మైనార్టీ కాంపోనెంట్ యాక్ట్ అమలు చేయాలి

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మైనారిటీ కాంపోనెంట్ యాక్ట్ (సబ్ ప్లాన్) అమలు చేయాలని అఖిల భారత షహీద్ టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్‌ఖాన్ డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి మైనార్టీ వర్గాల సంక్షేమాభివృద్ధి పాటుపడాలన్నారు.

### ఆగస్టు 10 వరకూ వేరుశనగ విత్తుకోవచ్చు

మడకశిరరూరల్: ఖరీఫ్‌లో భాగంగా ఆగస్టు 10వ తేదీ వరకూ వేరుశనగను విత్తుకోవచ్చని ఏఓ తిమ్మప్ప రైతులకు తెలిపారు. మంగళవారం ఆయన వైబీ హళ్లి, భక్తరపల్లి గ్రామాల్లో పర్యటించి రైతులు సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు.

### ఉన్నత చదువుతోనే బంగారు భవిష్యత్తు

రొళ్ల: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకుని బంగారు భవిష్యత్తును రూపొందించుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండల పరిధిలోని టీడీ పల్లి ప్రాథమికోన్నత, గొల్లహట్టి ప్రాథమిక తదితర పాఠశాలలను ఎంఈఓ సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు, తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.

## క్లుప్తంగా

### ఎస్పీని కలిసిన సబ్ కలెక్టర్



ఎస్పీకి మొక్కను అందిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్నను పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. అనంతరం శాంతిభద్రతలపై కాసేపు చర్చించారు.

### రూ.29,950 దుర్వినియోగం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులపై తనిఖీ బృందం సభ్యులు నివేదిక చదివి వినిపించారు. రూ.29,950 నిధులు దుర్వినియోగం అయ్యాయని తేల్చారు. డ్వామా పీడీ శివశంకర్, ఏపీడీ శివానందనాయక్ ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఏపీఓ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక తనిఖీపై రేపు ప్రజా వేదిక

గోరంట్ల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా గోరంట్ల మండలంలో జరిగిన పనులపై గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. సామాజిక తనిఖీలో వెల్లడైన వివరాలను సభ్యులు బహిరంగా సభలో చదివి వినిపిస్తారని పేర్కొన్నారు.

### హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని జిల్లేడుగుంట ఆంజనేయస్వామి, భక్తరపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో శాశ్వత హుండీ కానుకలను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. ఆంజనేయస్వామి ఆలయంలో రూ.2,30,740 లక్షలు, లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో రూ.6,03,569 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసింహారాజు తెలిపారు. రెండు నెలల్లో హుండీల నుంచి మొత్తం రూ.8,34,309 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

### పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

అమరాపురం: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా పేర్కొన్నారు. మంగళవారం అమరాపురం ఇందిరమ్మకాలనీలో ఆయన ప్రాథమిక ఆరోగ్య సిబ్బందితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, కార్యదర్శి భాస్కర్, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

### 'కరాటే' విజేతలకు సన్మానం



సర్టిఫికెట్లు, ట్రోఫీ అందిస్తున్న సీఐ శ్రీనివాసులు

హిందూపురం: హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్ పోటీల్లో సెన్సేయి ఫైరోజ్ ఆధ్వర్యంలో విజేతలుగా నిలిచిన వారిని వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు సన్మానించారు. మంగళవారం ముదిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 22 మంది కరాటే విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారికి సర్టిఫికెట్లు, ట్రోఫీ అందజేశారు.

### 'టీచ్ టూల్' శిక్షణ పరిశీలన



మాట్లాడుతున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం టౌన్: తరగతి గదిలో విద్యార్థులు చదువుకోవడానికి అనుకూలమైన పరిస్థితులను ఉపాధ్యాయులు కల్పించాలని, వివక్ష చూపరాదని టీచ్ టూల్ అబ్జర్వర్ కోఆర్డినేటర్ అబ్రహాం సూచించారు. పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, మాస్టర్ ట్రైనర్స్ రాజు, ఓబులేషు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులు, విధ్వంసం, హత్యా రాజకీయాలకు నిరసనగా బుధవారం ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో తాను కూడా పాల్గొంటున్నట్లు మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. తాను ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నట్లు ఆయన 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రోజూ ఏదో ఒక చోట బాలికలు, మహిళలపై లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను వినుకొండలో దారుణంగా హత్య చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, ఈ రాక్షస పాలన గురించి దేశ ప్రజలకు తెలియజేయడానికే వైఎస్ జగన్ ఢిల్లీలో ధర్నా చేస్తున్నారని పేర్కొన్నారు. ధర్నాకు రాష్ట్ర ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు పలకాలని కోరారు.

### గర్భిణులకు వైద్య పరీక్షలు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యులు హరికుమార్, ఓంకార్ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు బద్రీ హోటల్ నిర్వాహకులు ఏఎస్ఐ మురళి చేతుల మీదుగా ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నాయకుడు, హెల్త్ సూపర్వైజర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

### డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పర్యటన



దాండియా ఆడుతున్న విద్యార్థినులు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం రికార్డులను పరిశీలించింది. కళాశాల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో సమావేశమై పలు అంశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కేశవరావు, న్యాక్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ రాజేంద్రసింగ్ సంగ్వాన్, కోఆర్డినేటర్ బజ్రాబల్లమ్‌పాల్, డాక్టర్ పాల్ హ్యూమన్ తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన భోజనాన్ని అందించాలి

అమరాపురం: పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని ఎంపీడీఓ భాస్కర్ హెచ్ఎం, ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. సోమవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.